క్లుప్తంగా

క్లరికల్ ఉద్యోగులకు అండ

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని సింగరేణి క్లరికల్ ఉద్యోగులకు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) అండగా నిలుస్తుందని ఆ సంఘం బ్రాంచ్ ఉపాధ్యాక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం మణుగూరు ఏరియాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్లరికల్ సిబ్బందిని స్థానిక జీఎం కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్‌నల్ పరీక్షలు రాసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీబీజీకేఎస్ బ్రాంచ్ నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, కృష్ణ, వెంకట్, సీత, శైలజలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో ఉన్న తులసమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వాల్ పోస్టర్లను శ్రీ సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ అక్కినేని లోకేష్, డాక్టర్ సురపనేని శ్రీక్రాంతిల చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని లోకేష్ మాట్లాడుతూ.. అమ్మవారి జాతర మహోత్సవములు ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగనున్నట్లు తెలిపారు. పూజారి సొందే చిరంజీవి, అజీజ్ వీర్రాజు, మురళి పాల్గొన్నారు.

సమ్మక్క-సారక్క కల్యాణం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలో తిరుమలకుంట గ్రామంలో గురువారం సమ్మక్క-సారక్క కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వగ్గెల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం వారి చేతుల మీదుగా సమ్మక్క-సారక్క కల్యాణాన్ని జరిపించారు. ముందుగా మహిళలు గ్రామం నుంచి ఆలయం వరకు వెదురు మొక్కను పట్టుకుని, డప్పు వాయిద్యాలతో తరలి వచ్చారు. ఆలయం వద్ద జరిగిన కల్యాణ వేడుకలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

అశ్వాపురం: 19 ఏళ్లుగా మహిళల అభ్యున్నతికి, మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి అహర్నిశలు కృషి చేస్తున్న తమ సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మండలంలోని వీఓఏలు మండల కేంద్రంలో గురువారం ఏపీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ.. తమపై పని భారం పెరుగుతున్నా రూ.3,900 గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఈ నెల 16 వరకు ఆన్‌లైన్ పనులు బంద్ చేశామని, ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్త బంద్ ప్రకటిస్తామని అన్నారు.

బీజేపీని తరిమికొట్టాలి

భద్రాచలంఅర్బన్: స్వార్థ రాజకీయాల కోసం పదవ తరగతి పేపర్ లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతున్న బీజేపీని రాష్ట్రంలో, దేశంలో లేకుండా తరిమికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక చందర్‌రావు భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతిలో నెలకొన్న ప్రభుత్వాలను కూల్చడంతో పాటు ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తుందని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుక, సున్నం గంగ, నాయకులు సోయం జోగారావు, రవి పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మూడు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం దమ్మపేట ప్రధాన సెంటర్‌లో మేజర్ గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాలను స్థానిక సర్పంచ్ ఉయ్యాల చినవెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పసుపులేటి కృష్ణ, వార్డు మెంబర్లు చామర్తి గోపిశాస్త్రి, పగడాల రాంబాబు, రాజిని రాంబాబు, చిట్టెమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రణదీవె వర్ధంతి

బూర్గంపాడు: భారత కార్మికోద్యమ నిర్మాతల్లో ఒకరైన బాలచంద్ర త్రయంబక్ రణదీవె 33వ వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. బూర్గంపాడు మార్కెట్‌యార్డులో రణదీవె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య మాట్లాడుతూ.. 1970లో ఏర్పడిన సీఐటీయుకు 1991 వరకు జాతీయ అధ్యక్షుడిగా రణదివె కార్మికోద్యమాలను సాగించారన్నారు. కార్యక్రమంలో బయ్యా రాము, వెంకటేశ్, రవిప్రసాద్, సంపత్, శ్రీను, దుర్గాప్రసాద్, రాము, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్ఐకు ఫిర్యాదు

దుమ్ముగూడెం: రేగుబల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబాలకు చెందిన వారు గ్రామంలో చర్చిలకు వెళ్లే వారికి ఇచ్చిన ఎస్సీ సర్టిఫికెట్లను విచారణ జరిపి రద్దు చేయాలని, వారికి బీసీ-సీ సర్టిఫిట్‌లను అందజేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ఆదినారాయణ, లక్ష్మయ్యలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటరాజు, రఘు, హరీష్, కార్తీక్, సీతారాములు, ప్రవీణ్, ముత్యాలు, బాబురావు, జయరాజు, వెంకటేశ్వర్లు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కలగానే రైతు బజార్

- ఏళ్ల క్రితమే ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- అయినా కాగితాలకే పరిమితం
- రహదారుల వెంబడే రైతుల విక్రయాలు


జాతీయ రహదారిపైనే విక్రయాలకు ఉంచిన అరటి గెలలు

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రంలో రైతు బజారు ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. ఏళ్ల క్రితమే రైతు బజారు మంజూరు కాగా, ఇది కాగితాలకే పరిమితమైంది. అందుబాటులో సువిశాలమైన ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ దీనిని ఏర్పాటు చేసేందుకు పాలకులు ముందుకు రావడం లేదు. దాంతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అశ్వారావుపేట మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలు ఉండగా, దాదాపు 60 వేలకు పైనే జనాభా ఉన్నారు. వారంతా మండల కేంద్రానికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. స్థానికంగా రైతు బజారు లేకపోవడంతో వీరంతా కూరగాయల దుకాణాల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదే అదునుగా దుకాణాలదారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద తక్కువ ధరలకే కూరగాయలు కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు వినియోగదారులకు విక్రస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో వినియోగదారులు అధిక ధరలకు, వాటిని కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. దుకాణాలదారులు, దళారులు మాత్రం లాభాలు పొందుతున్నారు.

కూరగాయల పంటలు అధికమే..

స్థానికంగా రైతు బజారు ఏర్పాటు చేసేందుకు అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయి. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఉద్యాన పంటల సాగుకు కేరాఫ్ కాగా, ఈ రెండు మండలాల్లో వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. అలాగే అత్యధికంగా కూరగాయల పంటలను రైతులు ప్రతి ఏటా వానకాలం, రబీ సీజన్‌లో బోర్ల కింద సాగు చేస్తుంటారు. ముఖ్యంగా మండలంలోని నారంవారిగూడెం, కొత్త నారంవారిగూడెం, మొద్దులగూడెం, అచ్యుతాపురం, మద్దికొండ, అల్లిగూడెం, అనంతారం, జమ్మిగూడెం, కేశప్పగూడెం, పాపిడిగూడెం గ్రామాల్లో రైతులు అధికంగా బీర, కాకర, చిక్కుడు, వంగ, దోస, దొండ, బెండ పంటలను సాగు చేస్తుంటారు. అధిక సంఖ్యలో సాగులో ఉన్న కూరగాలయలను పండించిన తర్వాత వీటిని విక్రయించేందుకు గిరిజన, గిరిజనేతర రైతాంగం దూర ప్రాంతాలైన సత్తుపల్లి, ఖమ్మం, కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా రైతు బజారు ఉంటే సాగు చేసే రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వాటిని విక్రయించుకునే వెసులుబాటు దొరకుతుంది. వినియోగదారులకు సైతం అందుబాటు ధరలోనే కూరగాయలు లభ్యమై ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. ఈ ప్రాంతాల్లో అధికంగా సాగులో ఉన్న అరటి పంటకు సంబంధించిన గెలలను ప్రతి బుధవారం అశ్వారావుపేట విక్రస్తుంటారు. ఈ అరటి గెలలను ఖమ్మం వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తుండగా, రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతు బజారు ఏర్పాటు చేస్తే అరటి గెలలను సైతం ఇక్కడే విక్రయించవచ్చు.

నాటి ఎన్నికలతో బ్రేక్..

స్థానికంగా రైతు బజారు ఏర్పాటు చేయాలనే డిమాండ్ గడిచిన ఇరవై ఏళ్లుగా ఉండగా, దీనిని ఏర్పాటు చేసేందుకు పాలకులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో మాజీ ఎమ్మెల్యే వగ్గెల మిత్రసేన హయంలో, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన సున్నం నాగమణి ఇక్కడ రైతు బజారు ఏర్పాటుకు కృషి చేశారు. ఆమె చొరవతో నాటి వ్యవసాయ శాఖ మంత్రి చేసిన సిఫార్సు నేపథ్యంలో అశ్వారావుపేటకు రైతు బజారు మంజూరైంది. దీనిని ఖమ్మం రోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీకు కేటాయించిన సువిశాలమైన స్థలంలో ఏర్పాటు చేసే క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు కారణంగా నిలిచిపోయింది. ఎన్నికల తర్వాత దీని ఏర్పాటు విషయం మరుగున పడింది. దాంతో ఆ నాటి నుంచి రైతు బజారు ఏర్పాటు కలేగానే మారింది.

అందుబాటులో స్థలాలు..

రెవెన్యూ శాఖ స్థానికంగా మార్కెట్ కమిటీకు ఐదు ఎకరాల స్థలాన్ని ప్రధాన రహదారి పక్కనే ఖమ్మం వెళ్లే మార్గంలో కేటాయించింది. ఈ స్థలంలో మార్కెట్ కమిటీ ద్వారా రూ.10లక్షల వ్యయంతో చుట్టు ప్రహరీ నిర్మించగా, తాగునీటి సౌకర్యం కోసం ఎనిమిదేళ్ల క్రితమే బోరు సైతం ఏర్పాటు చేశారు. ఈ స్థలం గడిచిన నాలుగేళ్లుగా ఖాళీగా ఉండటంతో నిరుపయోగంగా మారింది. ఖాళీగా ఉన్న విలువైన ఈ స్థలం రైతు బజారు ఏర్పాటు చేసేందుకు వీలు ఉంది. అదే విధంగా మండల కేంద్రంలోని జంగారెడ్డిగూడెం వెళ్లే మార్గంలో కుడా ప్రధాన రహదారి పక్కనే ఇరిగేషన్ శాఖకు కేటాయించిన స్థలంలో దాదాపు రెండు ఎకరాలకు పైనే ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ రైతు బజారును ఏర్పాటు చేస్తే స్థానికులకు దగ్గర ఉండి, రైతు బజారుకు ఆదరణ ఉండే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

ఇలా అన్ని వసతులు ఉన్నప్పటికీ రైతు బజారు ఏర్పాటు మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు దీనిపై దృష్టి పెట్టి, ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఏర్పాటుకు కృషి చేస్తా..



అశ్వారావుపేటలో రైతు బజారు విషయం నా దృష్టికి రాలేదు. ప్రస్తుతం సాక్షి ద్వారా విషయం తెలియవచ్చింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటా. దీనిని స్థానికంగా ఏర్పాటు చేసేలా కృషి చేస్తా. తక్షణమే ప్రతిపాదనలు పంపిస్తా.

– మెచ్చా నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే

సమస్యలపై అధికారులతో సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరుటౌన్: నియోజకవర్గంలోని మిషన్ భగీరథ, ఐటీసీ అధికారులతో గురువారం తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక సింగరేణి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయా విభాగాల అధికారులతో మిషన్ భగీరథ నీటి సరఫరా విషయాలను గురించి చర్చించారు. వేసవి కాలంలో ప్రతి గ్రామంలో నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పినపాక నియోజకవర్గంలోని సారపాక సీపీడబ్ల్యూఎస్ స్కీం పునరుద్ధరణ ద్వారా సారపాక పంచాయతీలోని అన్ని గ్రామాలకు తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావులతోపాటు అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు నీలకంఠేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.1 కోటి 25 లక్షలు మంజూరైనట్లు, ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అక్కిరెడ్డి సంజీవరెడ్డి, యాదగిరిగౌడ్, ఆలయకమిటీ సభ్యులు ఈరెల్లి అచ్చయ్యచౌదరిలతోపాటు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

12న జాబ్ అప్రెంటీస్ మేళా

మణుగూరుటౌన్: మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న జాబ్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 12న ఉదయం 10గంటలకు మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ జాబ్ అప్రెంటీస్ మేళాకు హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీ, వీఎల్ఆర్ కంపెనీ, తోషిబా కంపెనీలు, సత్తుపల్లికి చెందిన మారుతీ సుజికి, వీఎం బంజరకు చెందిన తాళ్లూరి టెక్స్‌టైల్స్ కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఐటీఐలో ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ కోర్సులు పూర్తిచేసిన వారు తమ పూర్తి బయోడేటాతో హాజరు కావాలని, www.apprenticeshipindia.gov.in లో పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు పూర్తి బయోడేటా, అప్రెంటీస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఐటీఐ మెమో, ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, రెండు పాస్ ఫొటోలతోపాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకుని హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజున కంపెనీ వారిచే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కూలీలకు మలేరియా పరీక్షలు



ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల సుద్దగోతులగూడెం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జామాయిల్ కటింగ్ చేసేందుకు ఏపీ నుంచి వచ్చిన 20 మంది కూలీలకు వైద్య సిబ్బంది మలేరియా పరీక్షలు చేయగా, వారందరికీ నెగటివ్‌గా వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆరోగ్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడారు. పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు సత్యనారాయణ, బేబి నాంచారి, కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు


మణుగూరురూరల్: సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: మణుగూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం కార్డియో పల్మోనరి రీససిటేషన్ (సీపీఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సీపీఆర్‌పై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటుతో చనిపోయిన వ్యక్తిని సీపీఆర్ ప్రక్రియ ద్వారా ఏ విధంగా బ్రతికించవచ్చని ప్రయోగాత్మకంగా వివరించారు. గుండె సంబంధిత జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, ప్రజాప్రతినిధులు, పంచాయతీల కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో గురువారం సీపీఆర్ శిక్షకుడు డాక్టర్ రాకేష్, మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ఆశాలకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. హార్ట్ ఎటాక్‌కు గురైన వారి పట్ల ఎలా స్పందించాలి, ఏం చేయాలనే అంశాలపై 40 మంది ఆశాలకు శిక్షణ ఇచ్చినట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఆశాల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పూలమ్మ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, హెచ్‌వీ శారారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంత వేలంపాట ఖరారు

బూర్గంపాడు: బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంత వేలం పాటను గురువారం నిర్వహించారు. సారపాకకు చెందిన జే శ్రీనివాసరావు సంత వేలం పాటను రూ.1.54 లక్షలకు దక్కించుకున్నారు. బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ గదులకు కూడా వేలం పాట నిర్వహించారు. షాప్-1 పాటను రూ.90,324, షాప్-2ను రూ.1.04 లక్షలకు, షాప్-4ను రూ.97,728లకు, షాప్-05ను రూ.90,324లకు మాజేటి లావణ్య, భజన మల్లయ్యలు దక్కించుకున్నారు. సర్పంచ్ స్వప్న, కార్యదర్శి సమ్మయ్య, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8న బీఆర్ఎస్ మహాధర్నా

మణుగూరురూరల్: సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 8న నిర్వహించబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ.. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. బీజేపి విధానాలను వ్యతిరేకంగా రేపు జిల్లాలో జరగబోయే మహాధర్నాలో జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూడో రోజుకు చేరిన దీక్ష

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ పంచాయతీ ఎర్రగుంటపల్లి వద్ద గిరిజనులు చేపట్టిన దీక్ష గురువారం మూడో రోజుకు చేరింది. పలు గ్రామాలకు చెందిన నిరుపేద గిరిజనులు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ స్థలంలో దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షా శిబిరాన్ని నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ సందర్శించి, మద్దతు తెలిపారు. పేదలైన గిరిజనులకు తక్షణమే ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: బుడ్డగూడెం గ్రామానికి చెందిన మిడియం నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ప్రతినిధులు గురువారం చేయూతనిచ్చారు. రూ.3 వేల నగదు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచ్ తాటి వీరాంజనేయులు, ట్రస్ట్ ప్రతినిధులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, కైపు నాగిరెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి, కైపు చిన్ననాగిరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య, తిరుపతమ్మ కల్యాణం


కోలాట పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీఅంకమ్మ తల్లి ఆలయంలో గురువారం శ్రీగోపయ్య, తిరుపతమ్మ వార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ వేడుకల ముగింపును పురస్కరించుకొని ఆలయంలో హోమాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. తొలిత ఆలయంలో భక్తులు అగ్నిగుండంలో నిప్పుల పై నడిచారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, స్థానిక ఎమ్మెల్యే మెచ్చానాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అమ్మ వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖులకు శివాలయం పున:నిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన కోలాట పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులును అందజేశారు.

సోలార్‌లైట్ల పంపిణీ


వలస ఆదివాసీలకు సోలార్‌లైట్లు అందజేస్తున్న పోలీస్ సిబ్బంది

ములకలపల్లి: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వలస ఆదివాసీలకు సోలార్‌లైట్లు, దుప్పట్లు వితరణగా అందజేశారు. కమండలపరిధిలోని రాంపురం కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎస్సై సాయికిషోర్ రెడ్డి చేతుల మీదుగా 30 గొత్తికోయ కుటుంబాలకు వీటిని పంపిణీ చేశారు.

పోరాటాలతోనే పరిష్కారం

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు ముందుకు రావాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీలో నూతనంగా చేరిన కనితి భానుప్రకాశ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమంలో యువత చురుకుగా పాల్గొని ప్రజాసమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్, నాయకులు పాలెం చుక్కయ్య, బాబూరావు, సుజాత, నాగరాజు, శివ, కొక్కెరపాటి రవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా కులాలను కలపొద్దు

దుమ్ముగూడెం: గిరిజనేతరుల కులాలను కొత్తగా ఎస్టీ జాబితాలో కలపడాన్ని ప్రభుత్వం మానుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సింగవరం గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూప సీతయ్య అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనేతరులైన బోయ, వాల్మీకి, బెంతు కులాల ప్రజలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని అన్నారు. కొత్తవారిని కలపడం వల్ల భవిష్యత్తులో ఆదివాసీ జాతికి నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ సలహాదారులు కొరస వెంకటేశ్వరావు, ఏటీపీ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు జయ బాబు, రాష్ట్ర నాయకుడు కొమరం నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, జిల్లా అధ్యక్షుడు నరసింహారావు, డివిజన్ అధ్యక్షుడు మల్లూరు, వెంకటేష్, అల్లేశ్వరావు, వాగే వెంకటేష్, భద్రయ్య, రవి, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చండ్రుగొండ: దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా వైరస్ విజృంభిస్తున్న క్రమంలో ప్రజలందరూ కరోనా నిబంధనలు పాటించాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ కనకం తనుజ సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భౌతికదూరం పాటించాలని, విధిగా మాస్క్ ధరించాలని కోరారు. మూడురోజులపాటు దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆమె వెంట హెల్త్‌సూపర్‌వైజర్ యండి.ఇమాం, స్టాఫ్‌నర్సులు శంకరమ్మ, అనిత, సిబ్బంది లక్ష్మి, చంద్రకళ, పద్మ, కిరణ్ పాల్గొన్నారు.

హనుమాన్ విజయోత్సవ ర్యాలీ


ములకలపల్లి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

గుండాల: వీర ఆంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం గుండాల, ఆళ్లపల్లి, మర్కోడు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గుండాల రామాలయం నుంచి పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుండాల, పడుగోనిగూడెం, జామరగూడెం, పడుగోనిగూడెం, తూరుబాక గ్రామాల్లో గల ఆంజనేయ స్వామి విగ్రహాలకు పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆళ్లపల్లి నుంచి మర్కోడు వరకు బైక్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మానాల వెంకటేశ్వర్లు, యాసారపు రవీందర్, యాసారపు సురేష్, తాడోజు సురేష్, మానాల ఉపేందర్, మానాల శ్రావన్, మాచర్ల రంజీత్, గుండెబోయిన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: వీరహనుమాన్ విజయ యాత్ర సందర్భంగా మండలకేంద్రంలో గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత స్థానిక అభయాంజనేయ స్వామి దేవాలయం, ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్థానిక పూజార్లు ముకందల సత్యనారాయణశాస్త్రి, విస్సావజ్ఝుల సురేశ్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి రాజుపేట గ్రామం వరకూ, అటునుంచి సాయిబాబా ఆలయం మీదుగా మాధారం వరకూ ప్రదర్శన చేశారు. హనుమాన్ జెండాలు పట్టుకుని బైక్‌ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి గొడ్లరాజు, ఆలయకమిటీ అధ్యక్షుడు శనగపాటి రవి, బజరంగ్ దళ్ మండల బాధ్యులు బొమ్మగాని దేవేందర్, బిక్కుమళ్ల సుధాకర్, మేరల రాజేశ్, బండి సత్యనారాయణరెడ్డి, గంటా వెంకటేశ్వర్లు, పసుపులేటి గణపతి, జంపాల శివ, బీబినేని వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


భద్రాచలంటౌన్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి

నియోజకవర్గాల్లోని పలు చోట్ల బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని కార్యక్రమాలు కొనసాగాయి. పార్టీ బాధ్యులు, సీనియర్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు బీజేపీ జెండాను ఆవిష్కరణ చేశారు. దేశం, ధర్మం కోసం పాటుపడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతున్న పార్టీ బీజేపీ అని, ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల పార్టీ కూడా బీజేపీనే అని పలువురు అభిప్రాయపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు: జెండాను ఎగురవేస్తున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరెడ్డి


అశ్వాపురం: మొండికుంటలో జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకుడు ముస్కు శ్రీనివాసరెడ్డి